సేవాకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

న్యాల్‌కల్, మార్చి 5: ఆరు గ్యారెంటీల దరఖాస్తులను స్వీకరించేందుకు ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవాకేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సురేశ్ అన్నారు. మంగళవారం న్యాల్‌కల్ ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలు అమలు చేసే వరకు ప్రజాపాలన సేవాకేంద్రం కొనసాగుతుందన్నారు. ప్రజాపాలనలో ఆరు గ్యారెంటీల కోసం చేసుకున్న దరఖాస్తుల్లో తప్పులుంటే సేవా కేంద్రంలో సరి చేసుకోవాలన్నారు. అర్హులైన వారు సేవాకేంద్రానికొచ్చి ఆరు గ్యారెంటీ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

ప్రజాపాలన సేవా కేంద్రంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో సురేశ్

'ఉపాధి' పనులను వినియోగించుకోవాలి

రాయికోడ్, మార్చి 5: గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పనులను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని ఎంపీపీ అధ్యక్షుడు మొగులప్ప అన్నారు. మంగళవారం మండలంలోని కోడూర్, హస్నాబాద్, ఔరంగనగర్ గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ఉపాధిహామీ పనులను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు సౌకర్యాలు కల్పించాలన్నారు.

గ్రామాల్లో ఎక్కడైనా మంచినీటి సమస్య ఉంటే తక్షణమే పరిష్కరిస్తామన్నారు. ఆయన వెంట ఎంపీడీవో ఎంఎం షరీఫ్, ఉపాధిహామీ మండల అధికారి రమేశ్, మాజీ సర్పంచ్ నాగార్జున, పంచాయతీ కార్యదర్శి పాండు ఉన్నారు.



హస్నాబాద్‌లో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న ఎంపీపీ అధ్యక్షుడు మొగులప్ప

ఎమ్మెల్యే మాణిక్‌రావుకు ఆహ్వానం

జహీరాబాద్, మార్చి 5: కేతకీ సంగమేశ్వర జాతరకు రావాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావుకు ఈవో శశిధర్, ప్రత్యేకాధికారి రంగారావు ఆహ్వాన పత్రిక అందజేశారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాణిక్‌రావును సన్మానించి, ఆహ్వాన పత్రికను అందచేశారు.

కేతకీ సంగమేశ్వరాలయంలో మహాశివరాత్రి సందర్భంగా బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి 13వ తేదీ వరకు జరుగుతాయన్నారు.

ఎమ్మెల్యే మాణిక్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయాధికారులు

పల్స్‌పోలియో విజయవంతం

న్యాల్‌కల్, మార్చి 5: మండలంలోని మిర్జాపూర్(బి) ఆరోగ్యకేంద్రం పరిధిలో పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైందని వైద్యాధికారి నృపేన్‌చక్రవర్తి అన్నారు. పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా మూడోరోజైన మంగళవారం ఆరోగ్యకేంద్రం పరిధిలోని ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, సంచార జాతుల నివాసాలకెళ్లి వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, వలంటీర్లు చిన్నారులకు చుక్కల మందు వేశారన్నారు. ఆరోగ్యకేంద్రం పరిధిలో అందరి సహకారంతో నిర్వహిస్తున్న పల్స్‌పోలియో వంద శాతం పూర్తయిందన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్యామల, మల్లికార్జున్, రవికుమార్, గణేశ్, చండీదేవి, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

మునిపల్లి, మార్చి 5 : ఉపాధ్యాయులు సమయపాలన పాటించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని మునిపల్లి ఎంఈవో దశరథ్ తెలిపారు. మంగళవారం మండలంలోని గార్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో ప్రార్థన చేయించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకునేలా విద్యనందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలకు సమయానికి రాకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనంతరం పాఠశాలకు సంబంధించి పలు రికార్డులను పరిశీలించారు. మేళసంగం జిల్లా పరిశత్ పాఠశాలలో ఎంఈ వో దశరథ్‌ను సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది. మాజీ సర్పంచ్ శ్రీనివాస్ ఉన్నారు.

గార్లపల్లి పాఠశాలలో విద్యార్థులతో ప్రార్థన చేయిస్తున్న ఎంఈవో దశరథ్

భూసమస్యలపై అధికారుల స్పెషల్ డ్రైవ్

జిన్నారం, మార్చి 5 : పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి గ్రామాల వారీగా అధికారుల బృందం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోంది. మంగళవారం కిష్టయ్యపల్లి, నల్తూరు, జిన్నారం గ్రామాల్లో రెవెన్యూ అధికారుల బృందం గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసింది. దరఖాస్తు చేసుకున్న రైతుల నుంచి సమస్యలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు జనార్దన్, నీరుడి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ బాశెట్టి రాజు, మాజీ వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరం పరిష్కరించాలి

మండల సభలో ఎంపీపీ రవీందర్ గౌడ్

జిన్నారం, మార్చి 5 : మండల సభలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని జడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ రవీందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఎంపీపీ రవీందర్‌గౌడ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి జడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, ఎంపీడీవో అరుణ, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. పీసీబీ అధికారి మాట్లాడుతూ గడ్డపోతారం, ఖాజీపల్లి పారిశ్రామిక వాడలో నిబంధనలు పాటించని పలు పరిశ్రమలకు నోటీసులు ఇచ్చినట్లు చెబుతుండగా గడ్డపోతారం ఎంపీటీసీ జనాబాయి మాట్లాడుతూ పరిశ్రమలకు నోటీసులు ఇస్తే లాభం లేదని, వాటిని మూసేయాలన్నారు. పీఆర్‌ఏఈ మల్లేశ్ మాట్లాడుతుండగా ఖాజీపల్లి ఎంపీటీసీ భార్గవ్ మాట్లాడుతూ ఖాజీపల్లిలో వేసిన రోడ్లనే మళ్లీ వేసేందుకు నిధులు పెట్టడం సరికాదన్నారు. గ్రామసభ ఏర్పాటు చేస్తే ఎక్కడ రోడ్లు, డ్రైనేజీ అవసరమో ప్రజలే చెబుతారన్నారు. పౌర సరఫరాలపై డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున స్వామి మాట్లాడుతూ రేషన్ కార్డుల వివరాలు వెల్లడించారు. ధరణి దరఖాస్తులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పగా ధరణిలో దరఖాస్తు చేసుకున్న వారివే కాకుండా, మీ సేవలో దరఖాస్తు చేసుకోలేని వారి భూసమస్యలు కూడా చాలా ఉన్నాయని, కొత్తగా దరఖాస్తు చేసుకునే రైతుల సమస్యలను కూడా పరిష్కరించాలని ఎంపీపీ రవీందర్‌గౌడ్ ఉప తహసీల్దార్‌కు సూచించారు. ఆర్‌అండ్‌బీ అధికారి మాట్లాడుతుండగా శివనగర్ నుంచి కంజర్ల వరకు రోడ్లు అధ్వాన్నంగా ఉందని, దానిని బాగు చేయాలని జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్ సూచించారు. మిషన్ భగీరథ సరఫరాపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మాట్లాడుతుండగా ట్యాంకుల వరకు నీళ్లు వస్తున్నా ఇండ్లల్లో ట్యాప్‌ల వరకు నీళ్లు రావడం లేదన్నారు. ఏవో రవీంద్రనాథ్‌రెడ్డి వ్యవసాయ సాగు వివరాలు వెల్లడిస్తుండగా ఒకే దఫాలో రుణమాఫీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఎందుకు రుణమాఫీ చేయలేదని, రైతుబంధు కొందరికే వచ్చిందని వైస్ ఎంపీపీ గంగు రమేశ్ ప్రశ్నించారు. ఉద్యానవన శాఖ అధికారి శైలజ, జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ రవీందర్‌గౌడ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మండల సభలో మాట్లాడుతున్న జడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ రవీందర్‌గౌడ్

మద్యం విక్రయించొద్దు

హత్నూర, మార్చి 5: పన్యాల గ్రామంలోని కిరాణా దుకాణాల్లో మద్యం విక్రయించొద్దంటూ మహిళలు హెచ్చరించారు. మంగళవారం గ్రామంలోని పలు కిరాణ దుకాణాల వద్దకు మహిళలు మూకుమ్మడిగా వెళ్లి దుకాణ నిర్వాహకులతో మద్యం అమ్మకాలు నిలిపివేయాలన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ బెల్టుషాపుల్లో మద్యం అమ్మకాలతో తాగి వచ్చిన కుటుంబ యజమానులు తరచూ గొడవలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బెల్టుషాపుల్లో మద్యం విక్రయించకుండా పంచాయతీ కార్యదర్శితోపాటు అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

డిగ్రీ కళాశాల పీడీకి సన్మానం

అందోల్, మార్చి 5 : జోగిపేటలోని నెహ్రూ మెమోరియల్ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్(ఫిజికల్ డైరెక్టర్)గా విధులు నిర్వర్తిస్తున్న సుప్రియ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేశ్ ఆధ్వర్యంలో సుప్రియను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

టెలిఫోన్ అడ్వైజరీగా జోగినాథ్

అందోల్, మార్చి 5: ఉమ్మడి మెదక్ జిల్లా టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా గంగా జోగినాథ్ గుప్తా నియమితులయ్యారు. కమిటీ సభ్యుడిగా సిఫారస్ చేసిన మాజీమంత్రి హరీశ్‌రావు, బీఎస్ఎన్ఎల్ సీఎండీ ఊర్వశి సంగ్వార్‌కు ఈ సందర్భంగా జోగినాథ్ గుప్తా కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని అల్లాదుర్గం మండలం గడి పెద్దాపూర్ గ్రామానికి చెందిన జోగినాథ్ గుప్తా గతంలో జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పని చేశారు. పలు పార్టీల నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

'గృహజ్యోతి' నిరంతర ప్రక్రియ

రామచంద్రాపురం, మార్చి 5: గృహజ్యోతి పథకం నిరంతర ప్రక్రియ అని ఆర్సీపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈశ్వర్‌సింగ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలో విద్యుత్ వినియోగదారుల ఇంటింటికెళ్లి గృహజ్యోతి పథకంలో జీరో బిల్లులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలుచేసే దిశగా సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. గృహజ్యోతి పథకం నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. రేషన్ కార్డు కలిగిన ప్రతి వినియోగదాడికి 200 యూనిట్లలోపు ఉచిత కరెంటు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అద్దెకుండే వారికి కూడా ఈ పథకం వర్తిస్తుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరేశ్, హబీబ్‌జానీ, సంతు గౌడ్, నవీన్ గౌడ్, గిరి, పవన్ పాల్గొన్నారు.

డివిజన్‌లోని విద్యుత్ వినియోదారులకు జీరో బిల్లులు అందిస్తున్న నాయకులు

ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం

పుల్కల్, మార్చి 5: ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతుందని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బోయిని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పుల్కల్ గ్రామంలో గృహజ్యోతి పథకం కింద లబ్ధి చేకూరిన గ్రామస్తుల ఇంటి వద్దకు విద్యుత్ శాఖ అధికారులతో కలిసి వెళ్లి లబ్ధిదారులకు జీరో బిల్లును అందజేశారు. ప్రభుత్వం ఏర్పడి 100రోజులు కాకముందే విడుతల వారీగా పథకాలను అమలు చేస్తున్నామన్నారు. నిరుపేదల కోసం ఇందిరమ్మ పథకాన్ని ఈనెల 11వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తామన్నారు. ఈ పథకంలో జాగాలేని నిరుపేదలకు ఇంటి స్థలంతోపాటు నిర్మాణానికి రూ. 5లక్షలు సాయమందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లైన్‌మన్ సురేందర్, హెల్పర్ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ శ్రవణ్‌కుమార్, మాజీ ఉప సర్పంచ్ మన్నె విఠల్ పాల్గొన్నారు.

జీరో బిల్లును అందజేస్తున్న సిబ్బంది

పనులు పూర్తికాకుండా బిల్లులు ఎలా ఇచ్చారు?

మండల సభలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి

నారాయణఖేడ్, మార్చి 5: గ్రామాల్లో సర్పంచ్‌లు చేపట్టిన పనులు పూర్తి కాకుండానే బిల్లులు ఎలా ఇచ్చారని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి అధికారులను ప్రశ్నించారు. మంగళవారం నారాయణఖేడ్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షురాలు చాందిబాయిచౌహాన్ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలు చర్చకు రాగా పలు గ్రామాల్లో సర్పంచ్‌లు పూర్తి స్థాయి పనులు చేపట్టకుండా బిల్లులు తీసుకున్నారని, సర్పంచ్‌ల పదవీకాలం పూర్తి కావడంతో అసంపూర్తిగా ఉన్న పనుల పరిస్థితి ఏంటని ఎమ్మెల్యే అధికారులపై మండిపడ్డారు. గ్రామాల్లో పారిశుధ్యంతోపాటు ఇతర సమస్యల పరిష్కారంపై ప్రత్యేకాధికారులు దృష్టి సారించాలన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ 200 యూనిట్ల విద్యుత్, రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ అందేవిధంగా చూడాలన్నారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

న్యాల్‌కల్, మార్చి 5: యాజమాన్య పద్ధతులతో కుసుమ పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చని జహీరాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వరప్రసాద్, రమేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని రేజింతల్ గ్రామంలో డీడీఎస్, కేవీకే ఆధ్వర్యంలో కుసుమ పంట క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు మేలు రకం విత్తనాలు అందించి అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. భారతీయ నూనె గింజల పరిశోధన కేంద్రం విడుదల చేసిన ఐఎఫ్ఎస్-764 రకం కుసుమ విత్తనాలను రైతులకు అందిస్తున్నామన్నారు. ఈ రకం విత్తనంలో 30శాతం నూనె ఉంటుందని పేర్కొన్నారు. రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే కుసుమలో మంచి లాభాలు సాధించవచ్చన్నారు. కుసుమ పంట ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యానవన శాస్త్రవేత్తలు శైలజ, సాయిప్రియాంక, కైలాశ్, జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి, భూసార పరీక్ష నిపుణులు స్వామి, జగన్, ఏఈవో సనత్, బీటీఎం చరణ్, రైతులు పాల్గొన్నారు.

కుసుమ పంట చేను వద్ద మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త వరప్రసాద్

యాసంగి పంటలకు నల్లవాగు నీళ్లు అందించాలి

సిర్గాపూర్, మార్చి 5: యాసంగి పంటలకు నల్లవాగు నీళ్లు అందించి రైతులను ఆదుకోవాలని నారాయణఖేడ్ మాజీఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, కల్హేర్ జడ్పీటీసీ నర్సింహారెడ్డి మంగళవారం కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ నల్లవాగు కుడి ప్రధాన కాలువ ద్వారా నీళ్లు వదులుతారనే నమ్మకంతో కల్హేర్ మండలంలోని మార్డి, బీబీపేట, ఖానాపూర్, కృష్ణాపూర్, కల్హేర్ తదితర గ్రామాల రైతులు మొక్కజొన్న, వరి, జొన్న పంటలు సాగు చేశారన్నారు. ప్రాజెక్టు నీళ్లు వదలకపోవడంతో పంటలు ఎండి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఈ సీజన్‌కు తైబందీ చేసిన 800 ఎకరాలతోపాటు మరో 3000 ఎకరాలకు నీరందించేందుకు ప్రాజెక్టులో సరిపడ నీళ్లు ఉన్నాయని భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీసీబీ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, ఆయకట్టు రైతులు ఉన్నారు.



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న మాజీఎమ్మెల్యే, జడ్పీటీసీ, రైతులు

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ఝరాసంగం, మార్చి 5 : మండల పరిధిలోని మేదపల్లి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని మాజీసర్పంచ్ పరమేశ్వర్ పాటిల్ మంగళవారం జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య చాలా తీవ్రంగా ఉన్నదని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాగునీటి కోసం రెండు బోర్లు వేయించి గ్రామస్తుల కష్టాలు తీర్చాలన్నారు. దిగ్వాల్ నుంచి మిషన్ భగీరథ పైపులైన్‌ను మేదపల్లి గ్రామానికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలో బోర్లు వేయిస్తానని, పైపులైన్ల ద్వారా మిషన్ భగీరథ నీటిని అందిస్తామని హామీనివ్వడంతో మాజీసర్పంచ్ సంతోషం వ్యక్తం చేశారు. గ్రామస్తుల తరపున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న మాజీసర్పంచ్ పరమేశ్వర్ పాటిల్

కేతకీలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఝరాసంగం, మార్చి 5 : కేతకీ సంగమేశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆలయ అర్చకులు మంగళవారం అంకురార్పణ చేశారు. ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులతో కలిసి నాగులపుట్టలో పాలు పోసి పుట్ట మట్టితో శిఖర పూజ చేశారు. అనంతరం పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి వారికి రుద్రాభిషేకం, కుంకుమార్చన, శిఖర పూజ, పల్లకీసేవ, విఘ్నేశ్వర పూజలు, ధ్వజారోహణం నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శశిధర్, బండంపేట రాచన్న స్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి శివరుద్రప్ప, మాజీ సర్పంచ్ రుద్రప్ప పాటిల్, ఎంపీటీసీ సంతోశ్‌పాటిల్, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

నాగుల పుట్టలో పాలుపోస్తున్న ఆలయ అధికారులు, భక్తులు, నాయకులు

ఆస్తి పన్ను చెల్లించండి

అమీన్‌పూర్, మార్చి 5: ఈనెల 31 వరకు 90శాతం వడ్డీ రాయితీతో ఆస్తి పన్ను చెల్లించాలని అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ ప్రజల 10శాతం వడ్డీతో కలిపి చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ చట్టం ప్రకారం 2 శాతం వడ్డీతో చెల్లించాల్సి వస్తుందని, లేనిచో 2019 సెక్షన్ 87 ప్రకారం ఆస్తులు జప్తు చేస్తారని తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే ఆన్‌లైన్‌లో, రెవెన్యూ మేళాలో దరఖాస్తు చేసుకోవచ్చాన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

పుల్కల్,మార్చి5: ఎంపీపీ చైతన్యవిజయ్ భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన ఉదయం 11గంటలకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడీవో ఆనంద్‌మేరి ప్రకటనలో తెలిపారు. సర్వసభ్య సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధు లు హాజరు కావాలన్నారు. బదిలీపై వెళ్లిన ఎంపీడీవోలు మధులత సన్మానం ఉంటుందన్నారు.

నేడు ఎల్ఆర్ఎస్‌పై ధర్నా

సంగారెడ్డి, మార్చి 5: కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో విఫలమయ్యారని బీఆర్ఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఎల్ఆర్ఎస్‌పై కలెక్టరేట్ ఎదుట ఉదయం 10:30గంటలకు ధర్నా చేస్తామన్నారు. జిల్లాలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ధర్నాకు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎల్ఆర్ఎస్ పేరుతో ప్రజల నుంచి రూ.20వేల కోట్లు దోచుకునేందుకు పథకం రచించిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. ఎల్ఆర్ఎస్ వద్దు, భూములను ఉచితంగా క్రమబద్ధీకరిస్తామన్న కాంగ్రెస్ పార్టీ మాట తప్పి ప్రజలను దోచుకోవడానికి వ్యూహాలు చేస్తుందని విమర్శించారు. అప్పుడు ఎల్ఆర్ఎస్ వద్దని అడ్డగోలుగా మాట్లాడిన రేవంత్‌రెడ్డి, విక్రమార్క, సీతక్క, కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వంటి కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎంపీ బరిలో నిలపాలి

సిర్గాపూర్, మార్చి 5: నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డిని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా నిలపాలని చీమల్‌పాడ్ ఎంపీటీసీ శాంతాబాయిధూమానాయక్ మంగళవారం పార్టీ అధిష్టానాన్ని కోరారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా బాధ్యతాయుతంగా ప్రజలకు సేవలందించిన భూపాల్‌రెడ్డి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో ఓటమి చెందారన్నారు. పక్కనే ఉన్న జుక్కల్, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ నియోజకవర్గాల్లో భూపాల్‌రెడ్డికి మంచి పట్టు ఉందని, ఆయన సేవలు ప్రజలకు అవసరమని ఎంపీటీసీ అన్నారు. భూపాల్‌రెడ్డికి ఎంపీ టికెట్ ఇస్తే మంచి మెజార్టీ రావడం ఖాయమన్నారు.

ఏడుపాయలకు ప్రత్యేక బస్సులు

నారాయణఖేడ్, మార్చి 5: మహా శివరాత్రిని పురస్కరించుకొని ఏడుపాయలకు ఈ నెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడుపుతామని నారాయణఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. నారాయణఖేడ్ నుంచి 17, జూబ్లీబస్టాండ్ నుంచి 17, బొడ్మట్‌పల్లి నుంచి 8బస్సులు ఏడుపాయలకు నడుపుతామన్నారు. పెద్దశంకరంపేట నుంచి కొప్పోల్‌కు 5 బస్సులు నడుపుతామన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

పారిశ్రామికవాడలో వారోత్సవాలు

బొల్లారం, మార్చి 5: బొల్లారం పారిశ్రామికవాడలో 53వ జాతీయ భద్రత వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం పారిశ్రామికవాడలోని ర్యాంపెక్స్ పరిశ్రమలో ప్లాంట్ హెడ్ శాస్త్రి, హెచ్ ఆర్ శర్మ ఆధ్వర్యంలో భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమలోని కార్మికులకు ఉత్పత్తులను బట్టి భద్రత, ప్రమాదాల నివారణ అంశాలపై ప్లాంట్ హెడ్ శాస్త్రి అవగాహన కల్పించారు. పరిశ్రమలో వారం రోజులపాటు భద్రత వారోత్సవాలు నిర్వహించడమే కాకుండా ముగింపు రోజున ఉత్తమ కార్మికులకు బహుమతులు అందజేస్తామన్నారు.

కార్మికులకు అవగాహన కల్పిస్తున్న ప్లాంట్ హెడ్ శాస్త్రి

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-311802-All

CHANGE OF NAME

★I, ANDE SANTRA @ BASAMGARI SINDHUJA, D/o. Ande Ramreddy, R/o. H.No. 5-8-134/8/31, Shanthi Nagar, Sangareddy Town & District, TS. My Name Recorded in My SSC as ANDE SANTRA and after My Marriage My Name is Changed as BASAMGARI SINDHUJA, W/o. Basamgari Bhoopal Reddy. So I state that both Names are belongs to me one & the same.
NT-313828

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ